# "మనుష్య హృదయాలు"



శ్రీ ఎం. భుజంగరావు

"ఒకరివిషయంలో ఇంకొకరు అర్థంచేసుకోలేని 'ఇన్డివిడ్యుయల్' విషయాలు చాల ఉన్నాయ్—మనుష్య హృదయాల్లో.... ....

అందం, గుణం, మృదుత్వం, శీలం, తెలివి, మాధుర్యం మొదలైన లక్షణాలు — వివిధ క్రీడలు — మానసిక సామభూతి అర్థంకాని ఆత్మాకర్షణ అనేక జన్మాలనుంచి తెచ్చుకొంటున్నారా ఈ సంబంధం, అని ఆశ్చర్యం కలిగేటంత బలమైన పరస్పరాన్వేషణ చూపే వ్యక్తులున్నారు. ఇటువంటివి ఎన్నోభావాలు మనుష్య నిర్మిత సంసారాల్ని విలువనీక లోలోపల అలలువలె రేపుతున్నాయ్ నిర్మల హృదయంలో తుదిపంక్తులు సూదుల్లా గుచ్చుకొన్నాయి. తను చదువుతున్న పుస్తకంలోని పంక్తులకు తన జీవిత పుటలకు ఎంతో సంబంధంవున్నట్లు కనిపిస్తుందామెకు. ఆమె ఆలోచనలో మునిగిపోయింది.

"ఆతన్ని ఆనంద పరచేటంత అందం నాలో లేదా? గుణం, మృదుత్వం, శీలం, తెలివి, మాధుర్యం మొదలైన లక్షణాలు కనిపించవా? రసికత్వం, మానసిక సామభూతి నాలో లోపించాయా? నా అందాన్ని చూచే కదా యువకులు నన్ను భార్యగా పొందడానికి ఆరాటపడి నిరాశ పొందేవారు? నా సద్గుణాలను పొగడలేకుండా ఎవరుండేవారు? నా తీయనిపాట వింటూ రోడ్డుమీదవచ్చే పోయేవారు ఆనందాన్ని ఆనుభవించకుండా వుండేవారా? నాలో ఏ లోపాన్నిచూచి ఆయన తిరస్కరిస్తున్నారునన్ను?

ఆతనిచూపుల చల్లదనంలో తీయనిమాటల్లో నన్ను నేను మరచిపోయేదాన్ని. ఆతనిలోని ఏదో మహత్తర శక్తి నన్ను అతనివైపుకు లాగివేసింది. సిగ్గువిడిచి ఆతన్నే పెళ్లాడ్తానని తల్లితండ్రులతో చెప్పి ఒప్పించి ఆయన్ని వివాహమాడాను. ఆయనతో కలసి స్వర్గమయ ఆనందాన్ని అనుభవిస్తానని ఉవ్విళ్లూరాను. ఆతని వెడల్పైన ఛాతీమీద నిద్రపోయి తీయని కలలను కంటూ ఆనంద సాగరంలో జీవితనౌకను హాయిగా నడుపుకుందామనుకొన్నాను. కాని నాజీవితం ఇట్లా మారిపోతుందని ఏలా ఆనుకునేది? ఆతని ప్రశాంతమైన నయనాలు, నడవడిక చూశాక నన్ను ఇంతగా బాధపెడ్తారని, అతని హృదయం ఒక రాతిబండని ఎలా అనుకునేది? పన్నెండు నెలలూ పన్నెండు యుగాలుగా గడిచాయ్. ఏయొక్కనాడు ఆయనతో తీయగా మాట్లాడి ఎరుగను. ఏయొక్కరాత్రి ఆయనతో కబుర్లుచెప్పుకుంటూ గడిపి ఎరుగను. నన్నుచూస్తే పెద్దపులిని చూచినట్టు భయపడి దూరంగా తొలగిపోతున్న అతను ఏరకం మనుష్యులలో జమో తెలియకుండా ఉంది........"నిర్మల క్షణక్షణానికి ఉద్రిక్తురాలవుతుంది. భర్త తనను మోసంచేసి తన జీవితాన్ని నాశనం చేస్తున్నాడని ఆమె అంతరాత్మ ఘోషపెడుతూంది. ఆమె హృదయంలో విప్లవం చెలరేగింది. తనకు తన భర్త చేస్తున్న అన్యాయాన్ని భరించేందుకుగల శక్తి ఆమెలో నశించింది.

గదంతా నిశ్శబ్దంగా ఉంది. గోడన ఉన్న బెడ్‌లైటు గుడ్డిగా వెల్గుతూంది. బాణంలా చర్రునవచ్చి పుస్తకం చదువుకొంటున్న భర్తముందర ఆవేశంతో నిల్చుంది. ఆ క్షణంలోవున్న నిర్మల రూపాన్నిచూచి ఆశ్చర్యపోయాడు, సంజీవరావు.

"చెప్పండి. నాలో ఏలోపముందని మీరు నన్ను ఇంతగా బాధిస్తున్నారు. నా మనస్సును ముక్కలుముక్కలుగా తరిగివేస్తున్నారు. పెండ్లయి రమారమి సంవత్సరంకా వస్తూంది. మీ తీయనిమాటకు కరువయ్యాను. నేనేం పాపంచేశాన"ని నిర్మల గర్జించింది. ఆమె కళ్లెంబడి నిప్పురవ్వలు రాల్తున్నాయ్,

"నీలోఏలోపంలేదు నిర్మలా!" సంజీవరావు హృదయంలోని అశాంతిని బాధని ఆయనమోమే తెల్పుతూంది.

"ఇంతకుముందుగూడ మీరు ఇలానే అన్నారు. ఇప్పుడూ అదే అంటున్నారు. భర్త ప్రేమించని స్త్రీ బ్రతుకు బ్రతికేకంటే ఈ గ్రుక్కెడు ప్రాణాలు విడిచేస్తే మంచిది." అతను తృళ్లిపడ్డాడు. నిర్మల మాటలు ఆయన్ని ఎంతో బాధించాయి. ఆయన హృదయంలో ఆవేదన ఎక్కువైంది.

నిర్మల్! నిర్మల్! ఆమాట నీ నోటంట రానీకు. నాలో మండుతున్న అగ్ని ఇప్పటికే దహించివేస్తుంది. ఇలా రా నాదగ్గర కూర్చో. నా దుఃఖానికి కారణం చెప్తాను విను. ఇది నా ప్రణయ గాథ. ప్రణయంలో ఆరంభించింది, ప్రణయంలో ముగిసింది. నేచేసిన పాపకార్యానికి అసహ్యించుకొంటావేమో...." ఆయన కళ్ళవెంబడి నీళ్లు జలజలా రాల్తున్నాయ్. నిర్మల ఆయన చెప్పేంది వింటూంది.

"అవి నేను మద్రాసు కాలేజీలో చదువుకొనేరోజులు. క్లాసులో అందరికన్నా "జీవన్‌జ్యోతి" నన్నాకర్షించింది. ఆమెను చూడలేకుండా ఒక్క క్షణమైనా ఉండలేకపోయేవాణ్ణి. ఆమె చిలిపిచూపులు నా హృదయాన్ని 'దోచుకొన్నాయి. ఆమెతో మాట్లాడాలని నా హృదయం లేడి గంతులువేసేది. రోజూ కాలేజీకివస్తూ జ్యోతి నేనూ తలవనితలంపుగా కలుసుకొనే వాళ్ళం. ఆమెనుచూచి నేను నడకను తగ్గించేవాణ్ణి. ఆమె జోరుగా నడుస్తూ నావైపు తన మెరిసే కళ్ళతో చూస్తూ చిరునవ్వులతో ముందుకు సాగిపోయేది. ఆమె సౌందర్యం, అవయవపు వంపులనుచూస్తూ నన్ను నేను మరచేవాణ్ణి. కాలేజీలో రంగురంగు చిలు




నాలో ఏలోపముందని మీరు నన్ను ఇంతగా బాధిస్తున్నారు?......

కలు మావైపు అదోమాదిరిగా చూసేవి. కాందిశీకుల సహాయార్థం కాలేజీ స్టూడెంట్సంతా డ్రామావేయ నిశ్చయించారు. నన్ను హీరోగా, జ్యోతిని హీరోయిన్‌గా ఎన్నుకొన్నారు. మేమిరువురం ఒకరినొకరుచూచుకొని చిరునవ్వులు నవ్వుకొన్నాం. మా హృదయాలు కలుసుకొని ఒకదానినొకటి కౌగలించుకొనేందుకు తహతహపడ్డాయి. రానురాను మా ఇద్దరిమధ్య స్నేహం ఘనిష్టమయింది. ఇద్దరి హృదయాలు ప్రేమపూరితమైనాయి. పరీక్షలవగానే వివాహం చేసుకోవాలని నిశ్చయించుకొన్నాం.

ఆవేశతో పరీక్షలు ఆఖరయినాయి. సాయంకాలం ఆరు గంటలకు జ్యోతి నారూమ్‌కువచ్చింది. అప్పటి ఆమె ఆకారాన్నిచూచి ఆశ్చర్యపోయాను. ఏడ్వడంవల్ల ఆమె కండ్లువాచి ఉన్నాయి. బుగ్గలమీద ఎండిపోయిన నీటి ధారలు స్పష్టంగా కనిపిస్తున్నాయ్. నన్ను చూడగానే ఆమెలో దాగివున్నదుఃఖం ఒక్కమారు పొంగి పొరలి వచ్చింది. ఆమె వెక్కివెక్కి ఏడ్వడం మొదలుపెట్టింది. కారణం ఏమిటో బుజ్జగించి అడిగాను. దుఃఖాన్నిఆపుకొంటూ జ్యోతిచెప్పింది "నన్ను రామాపంతులువారి అబ్బాయికిచ్చి పెండ్లి చేసేందుకు మా నాన్నగారు నిశయించారు. మిమ్మల్నితప్ప అన్యులను వివాహం చేసుకోననిచెప్పి కంటికిమంటికి ఏకధారగా విలపించినా అతని రాతిహృదయం కరుగలేదు. నేనావివాహానికి ఒప్పుకోకపోతే ఒక్కక్షణమైన ఆ ఇంట్లోఉండనని ప్రతిజ్ఞచేశారు" జ్యోతిమాటలు నా శరీరంలోని రక్తాన్ని నీరుచేశాయి. నాకంతా అయోమయంగాఉంది. ఏంచేయాలో బోధపడలేదు.

రాత్రి ఎనిమిదిగంటలవుతుంది. జ్యోతి నేనూ సముద్రపుటొడ్డున ఇసుకలో కూర్చున్నాం. నలుప్రక్కలా



కారణం చెప్తా విను....ఇది నా ప్రణయగాధ........

అంధకారం, జ్యోతి హృదయాన్ని చీకటి క్రమ్ముకొంది. సముద్రకెరటాల తీవ్రతతోపాటు, జ్యోతిహృదయంలో నిరాశాభావాలు తీవ్రరూపందాల్చాయి. నా హృదయాన్ని తలనొన్చి ఏవేవో గంభీరమైన ఆలోచనలలో మునిగియున్నజ్యోతి చటుక్కునలేచి "రావ్! పద. ఈ నీచ లోకాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోదాం. పదవోయ్ రావ్" అంటూ నాచేతినిపట్టుకొని సముద్రగర్భంలోకి పిచ్చిదానిలా ఈడ్చుకుపోయింది. "రావ్! జన్మజన్మాలకు మనం భార్యా భర్తలుగా జన్మించాలని కోరుకో" అంటూ అలలలో మునిగి మాయమయిపోయింది జ్యోతి. అంతే.......... కాని ఆమెకొరకై నా ప్రేమ, ప్రాణం బలి ఇవ్వలేకపోయాను. స్వార్ధపరుణ్ణి!! ఆమె నన్ను గాఢంగా ప్రేమించింది....ఆ ప్రేమకొరకు తన ప్రాణాల్ని అర్పించింది. నీచుణ్ణి. పాపిని....ఆమెకు ద్రోహంచేశాను. ఆమెతో ఐక్యం కాలేకపోయాను. నిర్మలా! అప్పటినుండి నా జ్యోతియొక్క త్యాగమే జ్ఞాపకానికివస్తూ నన్ను కలవరపరుస్తుంది. నాలాంటి పాపి—నీచుడు ఈ లోకంలో ఉండడు........"

అతను ఆడదానిలా వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. ఆమె హృదయం వెన్నలా కరిగిపోయింది. తన భర్తహృదయంలో మండుతున్న అగ్నిజ్వాలల్ని చల్లార్చడానికి ప్రయత్నంచేస్తూంది నిర్మల.

## సినిమా సమాచార్

**ఎం. ఆర్. ఏ. ప్రొడక్షన్సు :**

తెలుగు సాంఘిక చిత్రం "మనదేశం" తయారయి విడుదలకు సిద్ధంగా వుంది. ప్రసాద్ దర్శకత్వపు మెరుగులతో కృష్ణవేణి అసమాన అపూర్వ నాట్యకళా ప్రదర్శనతో యీ చిత్రం తెలుగు ప్రేక్షక జనానికి అన్ని విధాలా సంతృప్తి పరచగలదు. నాగయ్య, నారాయణరావు, హేమలతమ్మారావు, కాంచన్‌లుకూడ యిందులో నటించారు.

**వాహినీ పిక్చర్స్ :**

జానపద చిత్రం "గుణసుందరి కథ" కె. వి. రెడ్డిగారి దైరక్షనులో తయారయి విడుదలకు సిద్ధంగావుంది. దీనిలో జూనియర్ లక్ష్మీరాజ్యం, సుబ్బారావు, శివరావు, రేలంగి, శాంతకుమారి, మాలతి యిత్యాది తారాగణమంతా నటించి చిత్రానికి వన్నె తెచ్చారు. వాహినీ చిత్రాల కెదురు చూచే ప్రేక్షక బృందానికిది కన్నుల పండువుగాను, వీనుల విందుగాను వుండగలదు.

**స్వస్తిక్ ప్రొడక్షన్సు :**

"ధర్మాంగద" చాలచోట్ల విడుదలయింది. క్రిష్ణవేణి, లింగమూర్తి, డాక్టరు సుబ్బారావు యిత్యాదులు నటించిన యీ జానపద చిత్రమును చమరియా టాకీ డిస్ట్రిబ్యూటర్సు వారు విడుదల చేసినారు.

## పజిల్ నం. 15

కరక్టు సొల్యూషను.

1. దండవంకి, 2. రాగిడి, 3. సూర్య చంద్రవంక, 4. కంటె, 5. పాపిడి పిందెలు, 6. వడ్డాణము.

ఒక తప్పుతో పంపిన ఈ క్రింది 10 మందికి మొదటి బహుమతి రు 15 పంచబడినది. తలకు రు 1-8-0.

(1) వేపకాయల సత్యవతమ్మ, కాకినాడ. (2) జె. కృష్ణరావునాయుడు, విశాఖపట్నం, (3) మొగంటి సూరరాజు, కాకినాడ, (4) సనివాడ హనుమంతరావు, విశాఖ. పట్నం. (5) ఎ. రామకృష్ణరావు, విజయనగరం, (6) అరవకుమారి, విజయనగరం. (7) డి. లక్ష్మి అమ్మ, పైదాపేట. (8) టి. లక్ష్మిదేవి, సికింద్రాబాద్. (9) పి. శ్యామల, ఖర్గపూర్, (10) బచ్చు మంగమ్మ, కటక్.

రెండు తప్పులతో పంపిన ఈ క్రింది యిద్దరికి రెండవ బహుమతి రు 10 పంచబడినది.

1. కొడమంచిలి వెంకటసుబ్బారావు—పలివెల.
2. ఎస్. పట్టాభిరామయ్య—ముగ్గుళ్ళ.

**జెమినీ :**

"అపూర్వ సహోదరులు" తమిళ చిత్రం అక్టోబరు 20-వ తేదీన వెలింగ్టన్‌లో ప్రివ్యూ యివ్వబడింది. దీనిలో భానుమతి, యం. కె. రాధ, నారాయణరావు యిత్యాదులు అద్భుతంగా నటించారు. చాలచోట్ల విడుదలయింది.